క్లుప్తంగా

రాంజల చెరువులో నీటిని తరలించండి


మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని విన్నవిస్తున్న కౌన్సిలర్ పార్వతి, వెంకటేష్

ఆదోని టౌన్: పట్టణానికి తాగునీటిని అందించే రాంజల నల్లచెరువులో పాచిపట్టి రంగుమారిన నీటిని బయటకు పంపింగ్ చేయాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి, వార్డు ఇన్‌చార్జ్ వెంకటేష్ విన్నవించారు. కలుషిత నీటిని తాగడం వల్ల ప్రజలు అంటువ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. వెంటనే నీటిని బయటకు పంపింగ్ చేసి, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటితో చెరువును నింపేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విన్నవించారు.

ఘనంగా ఆశా డే


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ బాబురాజు

ఆదోని టౌన్: పట్టణంలోని షరాఫ్‌బజార్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు బాబురాజు, లలితమ్మ, మేరీ, జ్ఞానేశ్వరి మాట్లాడారు. ఆశావర్కర్ల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


అభయాంజనేయ స్వామికి మంగళహారతి ఇస్తున్న పూజారి

ఆదోని అర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి 34వ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అభయాంజనేయ స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజాము నుంచి పంచామృతాభిషేకం, అలంకారం, గణపతిపూజ, భక్తి పుణ్యావాచనం, వాయుస్థితి హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ జరిగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించారు.

మాజీ సర్పంచ్ మృతి



తలారి ఈశ్వరమ్మ (ఫైల్)

గోనెగండ్ల: మేజర్ గ్రామ పంచాయతీ గోనెగండ్ల మాజీ సర్పంచ్ టి.ఈశ్వరమ్మ (70) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ఈమె భర్త తలారి వాసు దేవనాయుడు 1995లో గోనెగండ్ల సర్పంచ్‌గా గెలుపొందారు. 2000 సంవత్సరంలో గోనెగండ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా టి.ఈశ్వరమ్మ గెలుపొంది ఐదేళ్ల గ్రామానికి ఎన్నో సేవలు అందించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణానికి కృషి చేశారు. గోనెగండ్లకు ఆమె చేసిన సేవలు మరవలేనివని గ్రామస్తులు కొనియాడారు. ఆమె పార్థివదేహాన్ని గ్రామస్తులు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే ఆయా రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు మంగళవారం ఉదయం ఆమె స్వగృహానికి చేరుకొని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టెండర్ వాయిదా

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం జరగాల్సిన 'చెత్తాచెదారం ఊడ్చి శుభ్రం చేసేందుకు ఏజెన్సీల టెండర్' వాయిదా పడిందని మార్కెట్ యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల బుధవారం, గురువారం సాయంత్రం 5 గంటల వరకు పిలిచిన టెండర్ వాయిదా పడిందని, ఏజెన్సీ నుంచి టెండర్‌దారులు గమనించాలని తెలిపారు. తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు.

గంగమ్మవ్వకు బోనాల సమర్పణ


బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న రజకులు

గూడూరు రూరల్: పట్టణంలో మంగళవారం గంగమ్మవ్వ ఉత్సవాలను రజకులు ఘనంగా నిర్వహించారు. గూడూరు నగర కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాల నడుమ బోనాలను ఊరేగింపుగా కుమ్మరి కుంట వద్ద వెలసిన గంగమ్మ గుడికి తీసుకెళ్లారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, శేషన్న, సురేష్, అశోక్, రమేష్, రాజు, డోన్ చిన్న, లింగన్న, ఎర్రన్న, నాగరాజు, రామదాసు, శ్యామన్న, మాధమ్మ పాల్గొన్నారు.


ట్రాక్టర్‌తో పత్తి విత్తనాలు వేస్తున్న దృశ్యం


పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు


కాడెద్దులతో గొర్రు ద్వారా విత్తు పనులు చేస్తున్న రైతన్నలు

ఊపందుకున్న విత్తన పనులు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో మంచి వర్షాలు కురవడంతో మండలంలోని రైతన్నలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గత వారం నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వ్యవసాయ పనులు పూర్తి చేసుకున్న రైతులు పత్తి విత్తనాలు నాటే పనులను ముమ్మరం చేశారు. ముందస్తు వర్షాలకు నాటిన పత్తి విత్తనాలు మొలకెత్తడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి పంటలు బాగా పండి మంచి దిగుబడులు వస్తాయని ఆశతో ఉన్నారు. మండలంలో సోమవారం కురిసిన వర్షానికి చాలా మంది రైతులు మంగళవారం పొలాల్లో పత్తి విత్తనాలు నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు కాడెద్దుల ద్వారా, ట్రాక్టర్ల ద్వారా, మరికొందరు కూలీలతో విత్తు పనులు చేపట్టారు. దీంతో పొలాల్లో వ్యవసాయ పనులతో సందడి నెలకొంది. –కౌతాళం

సింగిల్‌విండో అధ్యక్షుడి రాజీనామా


బాపురం హనుమంతరెడ్డి

పెద్దకడబూరు: పెద్దకడబూరు సింగిల్‌విండో అధ్యక్ష పదవికి బాపురం హనుమంతరెడ్డి మంగళవారం రాజీనామా చేశారు. ఆయనతో పాటు కమిటీ సభ్యులు అబ్రహం, దస్తగిరి కూడా రాజీనామా చేశారు. వారు మాట్లాడు తూ.. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తమ రాజీనామాలను సంబంధిత అధికారులు ఆమోదించాలని కోరారు. ఇన్ని రోజులు తమకు సహకరించిన రైతులకు ధన్యావాదాలు తెలిపారు.

తాగునీటి సరఫరాపై సమీక్ష


కౌన్సిలర్లనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఈ చలపతిరావు, పక్కనే చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాపై మంగళవారం కౌన్సిల్‌హాల్‌లో చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్లు, ఎంఈ చలపతిరావు, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్లు, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 42 వార్డుల పరిధిలో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, ఒక్కొక్క వార్డులో ఒక్కో విధంగా నీటిని వదులుతున్నారని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు కిషోర్, ఫయాజ్, బాలాజీయాదవ్, రఘునాథ్‌రెడ్డి, వెంకటేష్, వైస్ చైర్మన్ నరసింహులు, మల్లికార్జున అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సరఫరాలో వేళలు పాటించడంలేదని, ఇష్టారాజ్యంగా నీటిని వదులుతున్నారని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పాలకవర్గ సభ్యులు లేవనెత్తారు. మురుగు వాడలు, శివారు ప్రాంతాల్లో వారానికోసారి కూడా తాగునీరు సరఫరా కావడంలేదని, ఇలా ఎందుకు జరుగుతుందంటూ కౌన్సిలర్లు నిలదీశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, పైపులైన్ లీకేజీల కారణంగా సమయ వేళలు మారుతుంటాయని, వాటిని పరిగణలోకి తీసుకోరాదని ఎంఈ చలపతిరావు పాలకవర్గ సభ్యులకు వివరించారు. జూలై 26వ తేదీ వరకు బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో పట్టణానికి సరిపడే నీరు ఉన్నాయని, ప్రస్తుతం వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయని, తుంగభద్ర జలాశయం నుంచి కూడా నీటిని కెనాల్‌కు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. వేసవిలోనూ పట్టణంలో నీటి కొరత లేకుండా అందించినట్లు చెప్పారు. అయితే తుంగభద్ర బోర్డు ఎస్ఈకి, జిల్లా కలెక్టర్, చైర్‌పర్సన్, సబ్‌కలెక్టర్‌లకు విజ్ఞప్తి పత్రాలను అందజేయనున్నామని కౌన్సిలర్లు బాలాజీ, వైస్ చైర్మన్‌లు చెప్పారు. ఆదోనికి నీటికొరత లేకుండా చూస్తామని, ప్రస్తుతం ఒక్కోవీధిలో ఒక్కో విధంగా నీటి సరఫరా వేళలు ఉన్నాయన్నారు. సరఫరా సమయాన్ని సవరించాలని అధికారులను కోరారు. రోజులు పెరుగుతున్నాయే తప్పా నీటిని సక్రమంగా పంపిణీ చేసి సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని పాలకవర్గ సభ్యులు ఆరోపించారు. నీటిని పొదుపుగా వాడాలని ఎంఈ కౌన్సిలర్లు, ప్రజలకు సూచించారు. ఎస్ఎస్ ట్యాంకులో నీటిని ఫిల్టర్ చేసే బెడ్‌లకు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమాచారం ఇవ్వరా?...

మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో నీటి సరఫరాపై జరిగిన సమావేశానికి సంబంధిత కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వరా? అంటూ 20వ వార్డు కౌన్సిలర్ ఎస్.పి.లక్ష్మీదేవి, వార్డు ఇన్‌చార్జ్ నగరూరు గద్దం చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఫయాజ్‌అహ్మద్, వైస్ చైర్మన్ మాబాషా అధికారులను నిలదీశారు. పూర్తిస్థాయిలో పాలకవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడం ఎంతవరకు సబబు అంటూ ప్రశ్నించారు. కౌన్సిలర్లందరికీ సమాచారం ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. ఇకపై ఇలా జరగకుండా చూడాలన్నారు.

కౌతాళంలో జోరు వాన


వైఎస్సార్ నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

కౌతాళం: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం జోరు వాన కురవడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా గ్రామంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఇప్పటికే దాదాపు 70 శాతం వరకు విత్తనం నాటే పనులు పూర్తి చేశారు. మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుండంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కౌతాళం చుట్టుపక్కల వర్షం పడుతున్నా మండలంలోని చాల గ్రామాల్లో తగినంతగా వర్షాలు లేకపోవడంతో రైతులు ఇంకా విత్తనాలు వేయలేకపోయారు. అన్ని చోట్ల సమృద్ధిగా వర్షాలు కురువాలని రైతులు, ప్రజలు కోరుకుంటున్నారు. సాయంత్రం కురిసిన వానకు కౌతాళం వైఎస్సార్ సర్కిల్ ఏరియాలో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

ఆదోని సెంట్రల్: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం నాయకులు నరసయ్య, సత్యన్న, రమేష్ నాయుడు, సుధాకర్‌బాబు, భీమరాజు తెలిపారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పురపాలక ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది పదో తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈనెల 16వ తేదీన ఆదోని పట్టణంలోని శిల్పా సౌభాగ్య నగర్‌లోని జీఎస్‌ఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శ్రీ వాల్మీకి మహర్షి ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈనెల 14వ తేదీలోగా తమ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం వివరాలతో 94918 69398, 96407 18346 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ఒక్కో సీటు చొప్పున ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 14వ తేదీ లోపు పాఠశాల వద్ద దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓసీ, బీసీలకు రూ.100, ఎస్సీ, ఎస్టీలకు రూ.50 పరీక్ష రుసుము చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 15వ తేదీన స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

13వ తేదీలోపు పాఠశాలలో చేరాలి

స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష ఫలితాల ద్వారా మెరిట్ కం రోస్టర్ విధానంలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 13వ తేదీలోపు పాఠశాలలో చేరాలని ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థుల జాబితా, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేసినట్లు వెల్లడించారు.

మలేరియా నివారణకు చర్యలు


ఆదోనిలోని మోడల్ స్కూల్‌ను పరిశీలిస్తున్న జిల్లా మలేరియాధికారి నూకరాజు

ఆదోని టౌన్: వర్షాకాలం కావడంతో ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, కస్తూర్బా పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో మలేరియాను నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. మంగళవారం ఆదోని పట్టణంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో దోమల నివారణకు అవసరమైన చర్యలు, మలేరియా, డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాలల చుట్టూ బ్లీచింగ్ ఫౌడర్, డీడీటీ స్ప్రే చేయించడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్‌హెల్త్ సెంటర్ల పరిధిలోని గ్రామాలు, పాఠశాలల్లో వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. జ్వరాలు వస్తే వెంటనే అందుబాటులో ఉండే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకుని మందులు పొందాలన్నారు. మలేరియా వ్యాధిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట సబ్ యూనిట్ అధికారి మంజునాథ్, వైద్యులు హరిత, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సస్పెన్షన్ రద్దు చేయాలి


మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకులు అజీమ్‌ఖాన్, డిపో అధ్యక్షుడు పి.వై.ప్రసాద్

ఆదోని రూరల్: ఎన్నికల కోడ్ పేరుతో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులపై విధించిన అక్రమ సస్పెన్షన్‌లను ఎత్తివేయాలని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకులు అజీమ్‌ఖాన్, డిపో అధ్యక్షుడు పి.వై.ప్రసాద్, సీఐటీయూ పట్టణాధ్యక్షుడు తిప్పన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక డిపో ఆవరణలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌డబ్ల్యూ యూనియన్ ఆధ్వర్యంలో డిపో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ ఉండగా మీటింగ్‌లు నిర్వహించారని ఏలూరు జిల్లా ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులను అధికారులు సస్పెండ్ చేశారని, వారు ఎలాంటి రాజకీయ మీటింగ్‌లు నిర్వహించలేదని యూనియన్ మీటింగ్‌లు మాత్రమే నిర్వహించారన్నారు. సరైన కారణం లేకుండా ఉద్యోగులను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర గౌరవ సలహాదారులు సుందరయ్యను సస్పెండ్ చేయడం, వీరితో పాటు కొంతమంది ఆర్టీసీ ఉద్యోగులను సస్పెండ్ చేయడం విచారకరమన్నారు. ఇప్పటికైనా వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

కేవీపీఎస్ నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.డి.ఆనంద్‌బాబు

మంత్రాలయం: మంత్రాలయం మండలం కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి మండల అధ్యక్షుడుగా హెసీ ఈరన్నను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో కేవీపీఎస్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.డి. ఆనంద్ బాబు , జిల్లా ఉపాధ్యక్షులు హెచ్ జయరాజ్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులోని అధ్యక్షుడితో పాటు మండల ప్రధాన కార్యదర్శి డి. అంజి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా సురేష్, మారెప్ప, దేవ సహాయం, దేవదానం, నరసన్న, లతో పాటు మరో 10 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కులవివక్షతను రూపు మాపి అన్నీ రంగాల్లో ఆర్థికంగా దళితులు ఎదగాలని సూచించారు. దళితులు ప్రతి ఒక్కరు చైతన్యవంతులుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మృతులకు సంతాపం

కోసిగి: మండల కేంద్రంలోని సిద్దప్పపాళెం వీధిలో వడ్డే నరసమ్మ (50) అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త గుండెపోటుకు గురై మృతి చెందింది. అలాగే కడపాళెం వీధిలో నివాసం ఉంటున్న జగ్గలి పెద్ద కాయప్ప (60) అనే వృద్ధుడు కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతు కోలుకోలేక మృతి చెందాడు. అదేవిధంగా చింతకుంట గ్రామంలో నివాసం ఉంటున్న నంగి నరసమ్మ (63) అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తరఫున వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి కోసిగి, చింతకుంట గ్రామాలకు వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎంపీపీ ఈరన్న, జగదీష్ స్వామి, కొరివి నాగరాజు, నాగేష్, చింతకుంట ఈరన్న, వడ్డే ఉలిగయ్య, మాన్వి వెంకటేష్ వెంట ఉన్నారు.

దోమలను నియంత్రిస్తే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు


తుగ్గలిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

తుగ్గలి: ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలు అని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తుగ్గలి పీహెచ్‌సీ వద్ద చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, దోమలు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలను నియంత్రిస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. అనంతరం పీహెచ్‌సీలో నిర్వహించి ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం అయ్యేలా చూడాలన్నారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణ


శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

ఆదోని అర్బన్: పట్టణంలోని వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మైక్రోటెక్ కంప్యూటర్స్ వారి సౌజన్యంతో 20 మంది బాల బాలికలకు నెల రోజులపాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించారు. మంగళవారంతో శిక్షణ తరగతులు పూర్తికావడంతో ఉత్తీర్ణులైన బాలబాలికలకు నిర్వాహకుల చేత సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా మహాసభ అధ్యక్ష కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, మమత, శ్రీదేవి మాట్లాడారు. మైక్రోటెక్ కంప్యూటర్స్ నిర్వాహకులు రఘు, శ్రీదేవి సౌజన్యంతో ఆర్థికంగా వెనకబడిన 20 మంది బాలబాలికలకు నెల రోజులపాటు రూ.5 వేలు విలువచేసే కంప్యూటర్ కోర్సు శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణలో ఎంఎస్ ఆఫీస్, వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్ తదితర కంప్యూటర్ కోర్సులకు సంబంధించిన బేసిక్స్‌పై అవగాహన కల్పించినట్లు వివరించారు. డైరెక్టర్లు యాదగిరి, వెంకటేశ్వర్లు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

గోనెగండ్ల: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారానికి బదులుగా 13వ తేదీ గురువారం నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయని ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ మంగళవారం తెలిపారు. మండలంలో 55 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 10,630 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని వివరించారు. ఇప్పటికే మొదటి విడతగా పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్లు మండలానికి చేరినట్లు తెలిపారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రాంగణం, తరగతి గదులు శుభ్రపరుచుకోవాలని, పాఠశాల ఆవరణలో ముళ్లపొదలు ఉంటే తొలగించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారుచేసేందుకు వంట పాత్రలను శుభ్రంచేసి సిద్ధంగా ఉంచుకోవాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సూచించామని వెల్లడించారు.

మలేరియా కేసు నమోదు

దేవనకొండ: మండలంలోని నెల్లిబండ గ్రామంలో మలేరియా కేసును గుర్తించినట్లు జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు గ్రామంలోని రంగస్వామి అనే వ్యక్తికి మలేరియాతో బాధపడుతున్నట్లు గుర్తించి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. బాధితుడి ఇంటి పరిసరాలను మంగళవారం పరిశీలించి డీడీటీ మందును పిచికారీ చేయించారు. వర్షాలు కురుస్తున్నందువల్ల సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బంది చేత స్ప్రే చేయిస్తామన్నారు. అనంతరం మలేరియా, చికున్‌గున్యా, బోధకాలు, మెదడు వాపు వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సూపర్‌వైజర్ రంగస్వామి, ఆశా, సీహెచ్‌లు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు


గాయపడిన రాజశేఖర్‌రెడ్డి

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో విద్యుత్ స్తంభం పైనుంచి పడి రాజశేఖర్‌రెడ్డి అనే యువకుడు గాయపడ్డాడు. కాంట్రాక్టు వర్కరుగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ రెడ్డి విద్యుత్ సరఫరా నిలిపివేసి స్తంభంపై పనిచేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. కింద కుపడి స్పృహ కోల్పోవడంతో గ్రామస్తులు వెంటనే వైద్య పరీక్షల కొరకు గుంతకల్లు వైద్యశాలకు తరలించారు.

ఎంఈఓలు నిర్లక్ష్యం వీడాలి


ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు

కోసిగి: అధిక ఫీజు వసూళ్లు, అక్రమ అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా ఎంఈఓలు మొయినుద్దీన్, నాగేశప్ప నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓలకు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లగా వారు అందుబాటులో లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీల్లో వినతిపత్రాలను ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోసిగి మౌంట్ కార్మెల్ స్కూల్ యాజమాన్యం అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు పలుమార్లు ఎంఈఓల దృష్టికి తీసుకెళ్లినా పాఠశాల యాజమాన్యంకు వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆ సంఘం నాయకులు సన్నీ, నరసింహులు, మల్లికార్జున, గురుస్వామి, హనుమంతు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీలను నిర్మించండి


పేట బసవేశ్వరస్వామి ఆలయ వీధిలో గుంతల్లో నిలిచిన నీరు

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలోని పేట బసవేశ్వరస్వామి ఆలయ ప్రధాన వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీలను నిర్మించి దోమలు, సీజనల్ వ్యాధులు దరి చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆ పరిసర వాసులు కోరుతున్నారు. సదరు రోడ్డులో భారీ గుంతలు పడి మురుగు, వర్షపు నీరు ముందుకెళ్లకుండా అధ్వానంగా మారడంతో పాటు పారిశుధ్యం పడకేసి దుర్వాసన వెదజల్లుతుందని వాపోయారు. దీని కారణంగ దోమల బెడదతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నట్లు వారు చెప్పారు. సమస్యను అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.